నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 30 మే 2024 | BHADRADRI KOTHAGUDEM

- చుక్కలు చూపిస్తున్న కూరగాయల ధరలు
- డబుల్ సెంచరీ కొడుతున్న పచ్చిమిర్చి ధర
- ఖమ్మం జిల్లాలో ఊసేలేని ఉద్యాన పంటల సాగు
- ఇతర జిల్లాలు, రాష్ట్రాలపై ఆధారపడి దిగుమతి
- అధిక ధరలతో అవస్థలు పడుతున్న సామాన్యులు

రైతుబజార్‌లో కూరగాయల ధరలు.. (కిలో రూపాయల్లో)

కూరగాయలు	ఏప్రిల్ 29న	మే 29న
టమాటా	30	38
పచ్చిమిర్చి	44	110
వంకాయ	20	24
కాకరకాయ	40	56
దొండకాయ	16	26
దోసకాయ	26	40
గోరుచిక్కుడు	36	56
బెండకాయ	22	30
బీరకాయ	40	78
క్యాబేజీ	20	24
ఆలుగడ్డ	30	34
క్యాప్సికం	54	60
కంచెకాకర	40	60

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు



ఖమ్మం వ్యవసాయం, మే 29: కొద్ది రోజుల క్రితం వరకు రూ.50లోపే ఉన్న కేజీ పచ్చిమిర్చి ధర.. పక్షం రోజులుగా అంచెలంచెలుగా పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు బహిరంగ మార్కెట్లో ఏకంగా కేజీ రూ.200కు చేరింది. దీంతో పచ్చిమిర్చి కొనాలంటే కాదు.. ఆ పేరు వింటేనే వినియోగదారులకు ఘాటెక్కుతోంది. అధిక ధరల ప్రభావం ఒక్క పచ్చిమిర్చితోనే కాదు.. అన్ని కూరగాయలపైనా స్పష్టంగా కన్పిస్తోంది. టమాటా ధర కూడా రూ.100కు చేరింది. దీంతో గృహిణులు, సామాన్యులు 'ఏం కొనేటట్టులేదు. ఏం తినేటట్టులేదు.' అంటూ వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో పూర్తిగా కూరగాయల ఉత్పత్తి తగ్గడంతో వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. వేసవికి తోడు రవాణా భారం ఎక్కువ కావడంతో ధరలు మరింత పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి గృహిణులకు ఏర్పడింది. ఏటా కొత్త పంటలు చేతికొచ్చే సమయంలో కొంత మేరకు ధరలు పెరగడం సహజమే అయినప్పటికీ నిరుటితో పోల్చితే ఈ ఏడాది ధరలు రెండింతలు పెరిగాయి. సీజన్‌కు అనుగుణంగా ఒక రకం కూరగాయల ధరలు పెరిగితే.. మరో రకం కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టేవి. కానీ ప్రస్తుతం ఉల్లిగడ్డలతో సహా అన్ని రకాల కూరగాయలూ పెరిగిపోయాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతో వినియోగదారులపై పెను ప్రభావం చూపుతోంది.

ఖమ్మంలో 4 రకాల మార్కెట్లు..

ఖమ్మంలో నాలుగు రకాల కూరగాయల సముదాయాలు ఉన్నాయి. వీటిలో మొదటిది హోల్‌సేల్ కూరగాయల మార్కెట్. దీనిలో ఏ రకం కూరగాయలు కొనుగోలు చేయాలన్నా కనీసం 10 కేజీలు కొనాల్సిందే. రెండోది రిటైల్ కూరగాయల మార్కెట్. దీనిలో కనీసం పట్టు (2.5 కేజీలు) కొనాల్సిందే. మూడోవి రైతుబజార్లు. వీటిలో పావు కేజీ నుంచి ఎన్ని కేజీలైన కొనుగోలు చేయవచ్చు. ఇక నాలుగోవి చిల్లర దుకాణాలు. అక్కడ కూడా అంతే. విడిగా వంద గ్రాముల నుంచి కూడా కొనుగోలు చేసుకోవచ్చు.

ఉనికి కోల్పోతున్న ఉద్యాన సాగు

ఉద్యాన పంటల సాగుకు చిరునామాగా నిలిచిన ఖమ్మం జిల్లా నేడు ఆ పంటల సాగులో ఉనికి కోల్పోయే స్థితి ఏర్పడింది. ప్రభుత్వం నుంచి కొంతమేర సబ్సిడీలు ఉన్నప్పటికీ రైతులు పెద్దగా ఆసక్తిగా లేనట్లు కన్పిస్తోంది. పొరుగు జిల్లాల్లో పరిస్థితి ఇందుకు కొంత భిన్నంగా కన్పిస్తోంది. అక్కడ కొద్దోగొప్పో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. దీంతో చాలా వరకూ కూరగాయలను ఇతర జిల్లాలు, రాష్ట్రాలను నుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

రూ.300 ఖర్చుచేస్తే రెండు కవర్లు కూడా నిండట్లేదు..

ఈ రోజు కూరగాయలు కొనేందుకు ప్రైవేట్ మార్కెట్‌కు వచ్చాను. రూ.300 వెచ్చిస్తే కనీసం రెండు కవర్లకు సరిపడా కూరగాయలు రాలేదు. పచ్చిమిర్చి ధర అడిగితే కేజీ రూ.200 అన్నారు. ఇంత ధర ఎప్పుడూ లేదు. తప్పనిసరి పరిస్థితిలో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కూరగాయలు లేనిదే ఇల్లు గడవదు. ప్రతిరోజూ కూరగాయల కోసమే కనీసం రూ.100 వెచ్చించాలి కదా.

–కళావతి, గృహిణి, ఖమ్మం

కోతులు, రియల్ ఎస్టేట్ ప్రభావంతో సాగు తగ్గింది

జిల్లాలో ఉద్యానపంటల సాగు సుమారుగా లక్ష ఎకరాల్లో ఉంది. అయితే, కూరగాయల సాగు గణనీయంగా తగ్గిన మాట వాస్తవమే. ఇందుకు అనేక కారణాలున్నాయి. ఖమ్మం శివారు మండలాల్లో వీటి సాగు ఎక్కువగా ఉంటోంది. ప్రస్తుతం ఈ మండలాల్లో రియల్ ఎస్టేట్ ప్రభావంతో భూముల ధరలు పెరిగాయి. దీంతో కూరగాయల సాగుకు రైతులెవరూ ముందుకు రావడం లేదు. దీనికి తోడు కోతుల బెడద విపరీతంగా ఉంది.

బీవీ రమణ, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

కౌంటింగ్‌కు సన్నద్ధం కావాలి

- ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు
- ఖమ్మం నియోజకవర్గానికి మాత్రం 18 టేబుళ్లు
- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మే 29: లోకసభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వీపీ గౌతమ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో లోకసభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ఉదయం 8 గంటలకు ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందన్నారు. కౌంటింగ్ సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తుంచుకోవాలని, ఈసీ మార్గదర్శకాలను పాటించాలని, ఎటువంటి సందర్భం ఎదురైనా ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికి సెల్‌ఫోన్ అనుమతిలేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రానికి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా గుర్తింపుకార్డు తీసుకురావాలని, కౌంటింగ్ ఏజెంట్లతో ఎటువంటి సంభాషణలు పెట్టుకోవద్దని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాల్లో 14 కౌంటింగ్ టేబుల్ ఏర్పాటు చేస్తామని, ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రం 18 టేబుళ్లు ఉంటాయని అన్నారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్ పూర్తిగా చెక్ చేసుకోవాలని, కంట్రోల్ యూనిట్ పింక్‌సీల్, గ్రీన్ ఫీల్డ్ చెక్ చేసి కౌంటింగ్ ఏజెంట్లకు చూపించాలని, కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం17సీ నందు నమోదైన ఓట్లు సరిచూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్‌ను సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కలెక్టర్ అన్నారు. కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వీవీ ప్యాట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, వీవీ ప్యాట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈటీపీబీఎస్ విధానం ద్వారా సర్వీస్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలన్నారు. శిక్షణ నోడల్ అధికారులు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ అధికారులకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. శిక్షణ ఈవీఎం యంత్రాలతో మాక్ కౌంటింగ్ నిర్వహించి, కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. అధికారులు ఆదర్శ్ సురభి, సత్యప్రసాద్, గణేశ్, వినోద్, సన్యాసయ్య, శ్రీరామ్, మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి'

లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ సామాగ్రి, స్టేషనరీ సేకరణ పూర్తి చేయాలన్నారు. లెక్కింపు అనంతరం ఈవీఎం యంత్రాలను ఈవీఎం గోడౌన్‌కు తరలింపు ప్రక్రియకు వాహనాల, కూలీల ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపు విధుల సిబ్బంది, పోలీసు సిబ్బందికి అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. పబ్లిక్ కమ్యూనికేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మీడియా కేంద్రం ఏర్పాటు చేసి, ఫలితాల ప్రదర్శనకు ఎల్ఈడీ స్క్రీన్, సమాచారం కోసం టెలివిజన్ల ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన విధంగా బ్యారికెటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు, సిబ్బంది, ఏజెంట్లకు పాసుల జారీ చేయాలన్నారు. సెగ్మెంట్ల వారిగా ఫలితాల చేరవేతకు లైజన్ అధికారుల నియామకం చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చేవారిని ప్రిస్కింగ్ చేసి, తనిఖీల అనంతరం లోనికి అనుమతించాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్‌కు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో వినోద్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌ప్రసాద్, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మీనన్, అనురాధ బాయి, సత్యనారాయణ, రాంబాబు, ఈడీఎం దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు
- 8,875 మంది అభ్యర్థులు
- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 29 (నమస్తే తెలంగాణ) : గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జూన్ 9వ తేదీన జరగనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 21 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయగా 8,875 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. పరీక్షాకేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష జరిగే రోజు ఉదయం తగిన భద్రత మధ్య ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలను తరలించాలని, అభ్యర్థులు ఎటువంటి గందరగోళానికి గురికాకుండా ఒక ప్రధాన గేటు ద్వారానే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని కోరారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఎల్రక్టికల్ వస్తువులు ఏవీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో రవీంద్రనాథ్, టీజీపీఎస్‌సీ రీజినల్ కో ఆర్డినేటర్ జగన్‌మోహన్‌రాజు, డీఎస్పీ రెహమాన్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ తిరుమలచారి, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్పాట్ బృందాలు, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వానకాలం పంటలకు అందుబాటులో విత్తనాలు

- రైతులకు ఇబ్బందులు లేకుండా విక్రయాలు
- అందుబాటులో 2,16,625 పత్తి విత్తన ప్యాకెట్లు
- విలేకరుల సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, మే 29 (నమస్తే తెలంగాణ) : వానకాలం పంటలకు అన్నిరకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. బుధవారం ఐడీఓసీలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు ఏ పంటలు వేసినా సరిపడా విత్తనాలు వ్యవసాయశాఖ సిద్ధం చేసిందన్నారు. డీలర్లు ఇప్పటికే విక్రయాలు చేస్తున్నారని అన్నారు. అధిక ధరలకు విక్రయించినా, స్టాక్‌లేదని రైతుల్ని ఇబ్బందిపెట్టినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ టీం నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నదని తెలిపారు. 2,47,044 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో 29,130 ప్యాకెట్లు ఇప్పటికే విక్రయాలు చేశారని తెలిపారు. వర్షాలు వచ్చాకే పత్తి విత్తనాలు విత్తాలని సూచించారు. వరి, మిర్చి, మొక్కజొన్న విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగు, జనుము, పిల్లిపెసర విత్తనాలు విక్రయాలు చేయడం జరిగిందన్నారు. విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డీలర్లు ఇబ్బందులు పెడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అన్ని మండలాల్లో విత్తన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాసీగోల్డ్ సీడ్ విత్తనాలు కూడా 50వేల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. డీలర్లకు కూడా అవగాహన కల్పించామన్నారు. రైతులను ఇబ్బంది పడినట్లు సమాచారం వస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డీఏవో బాబూరావు, ఏడీలు రవికుమార్, లాల్‌చంద్, ఏవోలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల కొరత లేదు: కలెక్టర్

ఖమ్మం వ్యవసాయం, మే 29 : జిల్లాలో పచ్చిరొట్ట విత్తనాలకు ఎలాంటి కొరత లేదని, కావాల్సినన్ని అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వీపీ గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 21,276 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అవసరం ఉండగా 14,067 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. ఇప్పటివరకు 8,908 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అమ్మకం జరగగా, ఇంకా 5,159 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మిగతా విత్తనాలు త్వరలో వస్తాయన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన పడవద్దన్నారు. కావాల్సిన దానికంటే అదనంగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఎరువులు, విత్తనాలు పుష్కలం

- జిల్లాలో రైతులకు సరిపడినన్ని సిద్ధంగా ఉన్నాయి
- అదును చూశాకే వానకాలం సాగును ప్రారంభించాలి
- అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- రసీదు తీసుకొని పంట చేతికొచ్చేదాకా భద్రపర్చుకోవాలి
- నకిలీ విత్తనాల భారిన పడి అన్నదాతలు మోసపోవద్దు
- విలేకరుల సమావేశంలో ఖమ్మం డీఏవో విజయనిర్మల

సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం డీఏవో విజయనిర్మల

రఘునాథపాలెం, మే 29: ఖమ్మం జిల్లాలో రైతుల సాగుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) విజయనిర్మల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో పచ్చిరొట్ట, పిల్లి పెసర, జీలుగు విత్తనాలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. మండల కేంద్రమైన రఘునాథపాలెం సహకార సంఘంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరుడు 20,370 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 21,276 క్వింటాళ్లు అవసరం కాగా ఇప్పటికే 14,167 క్వింటాళ్లను సొసైటీల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కాగా 7,356 క్వింటాళ్లను విత్తనాలు అవసరమైన రైతులకు 60 శాతం సబ్సిడీపై అందించినట్లు తెలిపారు. డిమాండ్‌కు తగినట్లు విత్తనాలను అందుబాటులో ఉంచడంతోపాటు అదనంగా మరో 10 వేల క్వింటాళ్లు తెప్పించేందుకు ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపించినట్లు చెప్పారు. అంతేగాక ఈ ఏడాది అంచనా మేరకు 2,01,900 పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. మొలక శాతం పరీక్షించిన తరువాతనే విత్తనాలను రైతుల సరఫరా చేసేందుకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అకాల వర్షాలను రైతులెవరూవిత్తనాలు విత్తొద్దని, అదును చూశాక మాత్రమే సాగును ప్రారంభించాలని సూచించారు. ఎర్ర నేలలకు 60 మిల్లీమీటర్లు, రేగడి నేలలకు 65 – 70 మిల్లీమీటర్ల వర్షం అవసరమని అన్నారు. పచ్చిరొట్ట, పిల్లిపెసర, జీలుగు పంటలను నేలలో కలిపి దున్నాలని సూచించారు. సేంద్రియ పదార్థాలకు, కర్బన శాతం పెరుగుదలకు వీటిని వినియోగించుకొని రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. రైతులందరూ ఒకే రకం విత్తనాలపై దృష్టి సారించకుండా, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పలు రకాల విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. పత్తికి నల్లరేగడి నేలలు అనువుగా ఉంటాయని అన్నారు. వర్షపాతాన్ని గమనించి యాజమాన్య పద్ధతులను అవలంబించాలని సూచించారు. అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే, కొనుగోలు చేసినప్పటి రసీదును పంట దిగుబడి వచ్చే వరకు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. నిషేధిత బీటీ–3, హెటీ కాటన్ రకం విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించి ఎవరైనా విక్రయిస్తున్నట్లు గమనిస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. అనంతరం రఘునాథపాలెంలోని 'జై కిసాన్' ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. విత్తన గోదాము ఆర్ఎం భిక్షం, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో ఇంటూరి భాస్కర్‌రావు, చాయాదేవి, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, సీఈవో మద్దినేని వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పోచారం సొసైటీ వద్ద విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

విత్తనాల కోసం వెతలు

కో ఆపరేటివ్ కార్యాలయం వద్ద కర్షకుల క్యూలైన్లు

పచ్చిరొట్ట విత్తనాల కోసం అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పోచారం సొసైటీలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని బుధవారం ప్రారంభించారు. వీటి కోసం రైతులు సొసైటీ కార్యాలయం దగ్గరకు వచ్చారు. కానీ రైతులకు కావాల్సినన్ని పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో పంపలేదు. కానీ పచ్చిరొట్ట విత్తనాలు ఎంతో అవసరమైన అన్నదాతలు వాటి కోసం నిరీక్షించారు. వందలాది రైతులు క్యూలో ఉండి విత్తనాల కోసం బారులు తీరారు. విత్తనాల కోసం గడిచిన పదేళ్లలో తామెన్నడూ ఇలాంటి కష్టాలు పడలేదని, మళ్లీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తమకు కష్టాలు మొదలయ్యాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

–పెనుబల్లి (కల్లూరు), మే 29

జిల్లాలో సీజన్‌కు సిద్ధంగా విత్తనాలు

- భద్రాద్రి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు

మాట్లాడుతున్న భద్రాద్రి జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పాల్వంచ రూరల్, మే 29 : వానకాలం సీజన్‌లో వ్యవసాయానికి సంబంధించి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు అన్నారు. పాల్వంచ పట్టణంలోని సొసైటీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో పత్తి, వరి, మిర్చి పంటలు వేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నామని, వాటికి సరిపడా విత్తనాలు కూడా సిద్ధం చేశామన్నారు. ఈ సీజన్‌లో పత్తి 2లక్షల 60వేల ఎకరాల్లో సాగు చేయాలని అంచనా వేశామని, దీనికోసం 5లక్షల పత్తి ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని, ప్రస్తుతం రైతులు 35వేల ప్యాకెట్లను రైతులు తీసుకున్నారన్నారు. లక్షా 60వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు అంచనా వేయడం జరిగిందని, దీనికి 40వేల క్వింటాళ్ళ విత్తనాలు అవసరమని, ఇవి కుడా అందుబాటులో ఉన్నాయన్నారు. మిర్చి 30వేల ఎకరాల్లో సాగు చేసేందుకు అంచనా కాగా 32 వేల పత్తి విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. విత్తనాల విషయంలో రైతులు ఏ విధమైన ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. జీలుగు విత్తనాలు 2,600 క్వింటాళ్లు జిల్లాలోని అన్ని సహకారసంఘాల్లో అందుబాటులో ఉంచామన్నారు. పిల్లిపెసర విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. రెండు దుక్కుల వర్షం తర్వాత పత్తి విత్తనాలు వేసుకుంటే అన్ని మొలకెత్తుతాయన్నారు. ఏ సమస్యవచ్చినా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఏవో శంకర్ పాల్గొన్నారు.